జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 15-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 164 పేజీలు: 8 వెల : రూ.7




# బాలల భవిష్యత్.. మనందరిదీ!

*** నేటి బాలలే.. రేపటి పౌరులు * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * చిల్డ్రన్స్ హెూమ్‌లో బాలల దినోత్సవం**

**శ్రీకాకుళం, నవంబర్ 14 (వార్త):** నేటి బాలలే రేపటి పౌరులని, అటువంటి బాలలకు ఉజ్వల భవిష్యత్తు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక అరసవిల్లిలో గల చిల్డ్రన్స్ హెూమ్‌లో జిల్లా బాలల రక్షణ విభాగం (మిషన్ వాత్సల్య), మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన బాలల దినోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తదుపరి బాలలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలలంతా పాఠశాలల్లోనే ఉండాలి, వారి హక్కులను పరిరక్షించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలలు ఎదిగే అవకాశాలు కల్పించాలన్నారు. బాలల హక్కులు పరిరక్షిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. బడి ఈడు పిల్లలు బడి వెలుపల ఉండరాదన్నారు. కార్యక్రమం అనంతరం ప్రత్యేక దత్తత సంస్థ (శిశు గృహ) సందర్శించారు. చిల్డ్రన్ హెూమ్ మరియు శిశు గృహ లలో మౌలిక సదుపాయల కల్పనకొరకు ఇంజనీరింగ్ విభాగం వారిద్వారా అంచనాలను తయారుచేసి ప్రతిపాదనలు పంపిన వెంటనే మంజూరు చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి. శాంతిశ్రీ, డిసిపిఓ కె. వి. రమణ, సూపరేంటెండెంట్ పుణ్యావతి, ఐసిడిఎస్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

బాలల హక్కులను కాపాడడంలో తల్లిదండ్రులతో పాటు అధికారులు, సమాజం, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాల్సిన అవసరముందని వక్తలు పేర్కొన్నారు. స్వీప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొమ్ము రమణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పర్యవేక్షణలో బాలల హక్కుల వారోత్సవాలు పోస్టర్ను వివిధ రంగాల ప్రముఖులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 14 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలల హక్కులను కాపాడుతూ సమాజ ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. బాలల వికాసానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విద్యావేత్తలు సురంగి మోహన్రావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ దేశ సౌభాగ్యం, ఉత్తమ బాలల నిర్మాణంతోనే సాధ్యమన్నారు. బాలలను పనిలో పెట్టకుండా వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా బాల్య వివాహాలను నిరోధించడంతో పాటు విద్య, వైద్యం అందిస్తూ వారి మనోభావాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు హారికాప్రసాద్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, జామి భీమశంకర్, పైడి హరనాథరావు, టెక్కం రాంగోపాల్, గుత్తు చిన్నారావు, తర్లాడ అప్పలనాయుడు, పందిరి అప్పారావు, కె.ఆర్.నాయుడు, మహిబుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి.. పోలీస్.. ప్రవృత్తి.. ఇసుక దందా

*** కొత్త పంథాలో దోపిడీ * బరిలో ఉండడు.. వెనుకుండి అంతా నడిపిస్తాడు * కాసులు కూడబెట్టడంలో పీజీ చేసినట్టున్నాడు * ఎమ్మెల్యే అనుచరుడినంటూ ప్రగల్భాలు**

అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసే.. ఇసుక దందాను దగ్గరుండి చేయిస్తున్నాడు. ఎమ్మెల్యే అనుచరుడినని, తననెవరూ ఏం చేయలేరన్న ధీమాతో వినూత్న మార్గంలో ఇసుకను తరలిస్తూ కాసులు కూడబెట్టుకుంటున్నాడు. వృత్తి పోలీస్ అయినా.. ప్రవృత్తి మాత్రం అక్రమాలు.. ధనార్జనే ధ్యేయంగా ముందుకుసాగుతున్నాడు. అక్రమంగా డబ్బులు ఎలా సంపాదించాలన్న దానిపై మాస్టర్ డిగ్రీ చేసినట్టున్నాడు. కొత్త పంథాను ఎంచుకుని మరీ ఇసుకను లారీల్లో విశాఖకు తరలించేస్తున్నాడు. ఇతగాడు నదిలోకి దిగడు.. ఇసుక తవ్వడు.. రవాణా కూడా చేయడు.. అయినప్పటికీ వెనుక ఉండి అంతా తానై వ్యవహరిస్తుంటాడు. ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన ఈ స్పెషల్ పోలీస్ కావడంతో లారీల్లో ఇసుక తరలించినపుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటాడు. హైవేపై తనిఖీలు లేనప్పుడు మాత్రమే రవాణా చేస్తుంటాడు.. ఈ జితేంద్రుడు ఫోర్జరీ సంతకాలు చేయడంలోనే జిత్తులమారి.

మనోడి అక్రమాలు, ఫోర్జరీ, బెదిరింపులు తదితర అవినీతి బండారాన్ని సాక్ష్యాధారాలతో త్వరలో 'జాతీయ వార్త' ముందుకుతీసుకువస్తుంది.

## తల్లి మందలించిందని.. విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**కాశీబుగ్గ/మందస, నవంబర్ 14 (వార్త):** తల్లి మందలించిందని మనస్థాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థిని క్షణికావేశంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఘటన శ్రీకాకుళం జిల్లా మందస మండలం సియాలుట్టీ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సియాలుట్టి గ్రామానికి చెందిన విద్యార్థిని టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం ఆమె కాలేజీకి వెళ్లక పోవడంతో తల్లి మందలించింది. అనంతరం తల్లిదండ్రులు పనులకు వెళ్లిపోయారు. మనస్థాపానికి గురైన ఆమె ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి బలవన్మరణానికి యత్నించింది. దీన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఖాళీ స్థలాలపై పన్ను వేయండి: కలెక్టర్

## విశ్వాసానికి ప్రతీక..!!

*** నమ్మకాన్ని నిరూపించిన లక్కవరం ఏకాదశి ఉత్సవం * వచ్చే ఏడాది 11 అరటి గెలలు కట్టనున్న విప్ * ఏడాదిలోగే మొక్కు తీరడంపై సంతోషం* యాగవిభూతిని నుదుటకు అద్దుకున్న అశోక్ బాబు**

లోపలి పేజీల్లో..

# స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు.. ప్రశంసనీయం

*** ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి**

**శ్రీకాకుళం క్రైం, నవంబర్14 (వార్త):** కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలలో పోలీసు సిబ్బందితోపాటు స్వచ్ఛందంగా సేవలు అందించిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం హిందుస్థాన్ స్కౌట్ అండ్ గౌడ్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా ఉత్సవాల సమయంలో పోలీసులకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. అరసవల్లి, శ్రీముఖలింగం బందోబస్తులలో స్వచ్ఛందంగా సేవలను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్బి సిఐ ఇమాన్యువల్ రాజ, హిందుస్థాన్ స్కౌట్స్ గైడ్స్ జిల్లా ఆర్గనైజర్ కమిషనర్ కె.నాగేంద్ర, జిల్లా కమిషనర్ ఎం.జగదీశ్వరరావు ఉన్నారు.

## రూరల్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం సాయంత్రం శ్రీకాకుళం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మింగా సందర్శించారు. పలు ముఖ్యమైన రికార్డులు, కేసు ఫైల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పలు ముఖ్యమైన కేసులు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని సీఐ పైడిపునాయుడికి సూచించారు. నేర నియంత్రణ చర్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టాలని ఆదేశించారు. ఆయన వెంట శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద ఉన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



## గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి పంచాయతీకి వచ్చిన నిధులు సక్రమంగా వినియోగించి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని జలుమూరు ఎంపీపీ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. గురువరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వ హించిన పంచాయతీ ప్లానింగ్ కమిటీ శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏవో, గ్రామ సర్పంచ్‌లు, ఎం.పి.టి.సిలు, మెండ రాంబాబు పాల్గొన్నారు.



# కళింగ రాజధాని శ్రీముఖలింగంకు తరలిరండి

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** కళింగ రాజ్య పూర్వపు రాజధాని శ్రీముఖ లింగంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా ఈనెల 17న నిర్వహించనున్న బాలి యాత్రకు తరలిరావాలని విజయనగరం జిల్లా కళింగ సంక్షమ సేవా సంఘం అధ్యక్షులు పేడాడ జనార్దన రావు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 17న సుధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు యాత్ర జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు శ్రీముఖలింగేశ్వర స్వామి దర్శనం, వంశధార నది తీరాన దీపోత్సవం ఉంటాయన్నారు. ఐదు వేల సంవత్సరాల నాటి ప్రాచీన సాంప్రదాయాన్ని పునః ప్రారంభం జరుగుతున్న సందర్భంగా కళింగసీమ ప్రాంతానికి చెందిన ప్రజలంతా హాజరుకావాలన్నారు. యువాన్ ద్వాంగ్ అనే చైనా దేశ పర్యాటకుడు కళింగుల పైన ఆయన అధ్యయనం చేస్తూ వీరు చాలా గొప్పవారని, తెలివైనవారని, కష్టపడేతత్వం ఉన్న వారిని, శౌర్యం పౌరుషం గలవాలని, ధైర్య సాహసాలు కలవారని పేర్కొన్నట్టు తెలిపారు. తంజావూరు లైబ్రరీలో ఒక గ్రంథంలో లిఖించబడినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంచరాన మురళీధర్, కోశాధికారి పూజారి భాస్కర రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.





## పలకలు, బలపాలు పంపిణీ

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. నేచర్ సేవ్ సొసైటీ ఆధ్వర్యంలో నరసన్నపేట మండలం కొటారుబిల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలబాలికలకు పలకలు, బల పాలు, పుస్తకాలు పంపిణీ చేశామని సొసైటీ సభ్యులు లుకలాపు రంజిత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోరుకొండ శాంతరావు, లోకేష్, మల్లేసు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అపార్ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి



**జలుమూరు, నవంబర్ 14(వార్త):** విద్యార్థుల ఆపార్ నమోదు ప్రక్రియలో పడుతున్న ఇబ్బందులను తొలగించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఏపీటీఎఫ్ జనరల్ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ఆయన నరసన్నపేటలో మాట్లాడుతూ.. పుట్టిన తేదీ ధ్రువ పత్రంతో పాటు నోటరీ కూడా ఇవ్వవలసి ఉంటుందని ఆధార్ సెంటర్ నిర్వాహకులు కోరుతున్నారన్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి



**జలుమూరు, నవంబర్ 14(వార్త):** వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు అధికంగా వస్తున్నాయని దీనిపై అవగాహన చేసుకోగలిగితే నివారణ సాధ్యమవుతుందని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని శిరీష తెలిపారు. గురువారం నరసన్నపేట మండలం తామరపల్లి గ్రామ పంచాయతీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో 73 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** 108 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ ప్రతినిధులు మురళీధర్, రామకృష్ణ గురువారం ఎంపీడీవో అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ఈనెల 25 లోగా పరిష్కరించకపోతే ప్రత్యక్ష సమ్మెలోకి దిగుతామన్నారు.



## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య అధికారి గురునాధరావు తెలిపారు. గురువారం జలుమూరు మండలం గొట్టివాడ పంచాయతీలో సైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శిబిరం నిర్వహించామన్నారు. ఈ క్రమంలో 76 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. వ్యాధుల పరంగా ఆయా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామని స్పష్టం చేశారు.



# ‘బడి ఈడు పిల్లలను పనిలో పెడితే చర్యలు’

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** బడికి వెళ్లవలసిన పిల్లలను పనిలో పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని నరసన్నపేట లేబర్ ఆఫీసర్ జయశంకర్ తెలిపారు. గురువారం ఆయన జలుమూరు, చల్లపేట గ్రామాలలో పలు షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి పరిస్థితుల్లో పిల్లలను పనిలో పెట్టవద్దని సూచించారు. వారిని అభివృద్ధి పథంలో తీసుకున్న వెళ్లేందుకుగాను ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ సీతారత్నం, వైకుంఠ ఉన్నారు.



## వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన అదనపు డీఎంహెచ్‌వో



**జలుమూరు, నవంబర్ 14(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను జిల్లా అదనపు డిఎం అండ్ హెచ్ ఓ తాడేల శ్రీకాంత్ ఆకస్మికంగా పరిశీలించారు. గురువారం జలుమూరు మండలం రానా పంచాయతీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన పంచాయతీలలో పీహెచ్సీలకు సంబంధించిన వైద్య సిబ్బంది తప్పనిసరిగా వైద్య సేవలు అందించాలని ఆయన స్పష్టం చేశారు.

## ఈశ్వరరావుకు పదవిపై హర్షం



**వజ్రపుకొత్తూరు, నవంబర్ 14 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవిందపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావుకు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నేతలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. హర్షం ప్రకటించిన వారిలో పలాస నియోజక వర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు సూరాడ మోహన్ రావు, మాజీ ఎంపీపీ గోరకల వసంతస్వామి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, చిన్న వంక సర్పంచ్ దువ్వాడ విజయలక్ష్మి, దువ్వాడ హేమా బాబు చౌదరి, గోవిందు పాపారావు,దున్న షణ్ముఖరావు, చింత నారాయణ సిపాన గోపి, దున్న నారాయణ ఉన్నారు.

# అపార్‌ను సులభతరం చేయాలి

**వంగర, నవంబర్ 14(వార్త):** ప్రభుత్వం విద్యార్థులకు, వారి యొక్క తల్లిదండ్రులకు ఇబ్బందులు కలుగకుండా అపార్ ను సులభతరం చేయాలని ఎంపీపీ యు సురేష్ ముఖర్జీ కోరారు. గురువారం తన ఛాంబర్ లో మీడియాతో మాట్లాడుతూ, అపార్ వలన విద్యార్థులకు అష్ట కష్టాలు తప్పడం లేదని, దీంతో వారి యొక్క తల్లిదండ్రులకు ఇబ్బందులు చెప్పలేదని దీన్ని ప్రభుత్వం సులభతరం చేయాలని ఆయన తెలిపారు. దీనివలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తీవ్ర నిరాశలకు గురవుతున్నారని దీన్ని పాఠశాలల స్థాయిలోనే పూర్తి పరిష్కారం జరిగేలా ప్రభుత్వం జీవో జారీజేసి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. అపార్లో లోటు పాట్లు త్వరగా తిను సరి చేసుకోవడానికి అధికార యంత్రాంగం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి చూపించడం లేదని, ఏదో చేద్దాం చూద్దాం అన్నా విధంగా అధికారులు ఉన్నారని, దీంతో మరింత ఇబ్బందులకు గురవ్వాల్సిన పరిస్థితి కనిపిస్తుందని, దీనివలన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పనులు మానుకొని, చేతిలో డబ్బులు ఖర్చు పెట్టి చేసుకుందాం అన్న కష్టతరంగా మారిందని వాపోతున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికైనా అపార్ వలన ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు.



# జనజాతీయ గౌరవ దివస్‌కు సర్వం సిద్ధం

**మెళియాపుట్టి, నవంబర్ 14(వార్త):** గిరిజన స్వాతంత్ర సమరయోధుడు బిర్సాముండా జయంత్యుత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఏకలవ్య పాఠశాల వద్ద జరగనున్న కార్యక్రమానికి సంబంధించి వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. జీసీసీ, వీడీవీకే, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, పర్యాటక శాఖ వంటి స్టాల్స్ ఏర్పాటు జరిగేలా చూడాలన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి వర్చువల్‌గా మాట్లాడే అవకాశం ఉన్నందున అందుకు సంబంధించిన నెట్ వర్క్ ఏర్పాట్లు చేసినట్లు పివో తెలిపారు. టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు, శ్రీకాకుళం డిఆర్డీఏ పిడి కిరణ్ కుమార్, గృహ నిర్మాణశాఖ పిడి నగేష్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రమాదేవి, ఐటిడిఏ డిడి అన్న దొర, పీహెచ్ వో గణేష్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, గిరిజన సంక్షేమ శాఖ డీఈ సిమ్మన్న, ఏఈ శ్రీకాంత్ ఎంపీడీవో, తహసీల్దార్ ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జూనియర్ కళాశాలలో ఆధార్ సెంటర్

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** జలుమూరు మండలంలో నిర్వహిస్తున్న ఆపార్ నమోదు ప్రక్రియలో వస్తున్న ఇబ్బందులను తొలగించే దిశగా ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేశామని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశామని వివరించారు. ఆపార్ నమోదులో పుట్టిన తేదీ సరిలేనందున ఈ సెంటర్లో దానిని సర్దుబాటు చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు.





**వంగర, నవంబర్ 14(వార్త):** వంగరలోని వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, టిడిపి నాయుకులు లచ్చుభుక్త కృష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు. చిన్నారులు వేసిన గాంధీ, నెహ్రు అల్లూరి సీతారామ రాజు జాన్సీ లక్ష్మీబాయి భగత్‌సింగ్, నేతాజీసుభాష్ చంద్ర బోష్ వేషదారణ పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీలలో ప్రతిభ సాధించిన విద్యార్థులుకు బహుమతులు అందజేశారు. అలాగే బాలల దినోత్సవం సందర్భంగా ఈ మండలం నీలాయవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెర్లాం మండలం అరస బలగ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బోను భాస్కరరావు మూడువేల రూపాయల విలువైన స్టేషనరీ విద్యార్థులకు అందించినట్లు హెచ్ఎం సిహెచ్ జయరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, కరస్పాండెంట్ కె పారినాయుడు, నేతాజీ, చక్రపాణి, విద్యా కమిటీ చైర్మన్ టి శంకర్, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు పి గౌరీశంకర్, పంచాయతీ సెక్రెటరీ లెంక ప్రదీప్, ఉపాధ్యాయుని కె.వాసంతి పాల్గొన్నారు.



# ఘనంగా బాలల దినోత్సవం

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** చిల్డ్రన్స్ డే సందర్భంగా చిన్నారులు చేపట్టిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. జలుమూరు మండలం గొల్లపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం గుండ మాధవి ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ వేషధారణలో వేడుకలను నిర్వహించారు. ఈ క్రమంలో మధర్ తెరిస్సా, కల్పన చావ్లా, ఎమ్మెస్ సుబ్బలక్ష్మి, సరోజినీ నాయుడు పాత్రలలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమం అనంతరం చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### జెబిటి ఆధ్వర్యంలో..

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** సారవకోట మండలం అవలింగి గ్రామ జెబిటి పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా గురువారం చాచా నెహ్రూ జయంతి ఉత్సవాలు జరిగాయి నెహ్రూ ఆశయాలను పాఠశాల వ్యవస్థాపకుడు జోగు మహంతి మోహన్ గాంధీ వివరించారు అనంతరం పురవీధుల్లో నెహ్రూ ప్రాధాన్యతతో ఊరేగింపు నిర్వహించారు.






**జలుమూరు, నవంబర్ 14(వార్త):** టెక్కలిపాడు పంచాయతీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా బంగారు బాల్యం ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ చాచా నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీలను నిర్వహించారు.



**మందస, నవంబర్ 14(వార్త):** మందసలోని శాఖా గ్రంథాలయం లో చిల్డ్రన్స్ డే, నెహ్రూ జయంతి నిర్వహించారు. దీనికిముఖ్యఅతిథిగా ఎంఈఓ లక్ష్మణరావు, సూర్య పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ్, పిఈటి ధర్మారావు మాస్టారు, ఇంగ్లీష్ మాస్టారు మోహన్ రావు సంతోష్ గుప్తా అందరం కలిసి గ్రంథాలయ అధికారిని జే విజయలక్ష్మి సమక్షంలో కార్యక్రమం జయప్రదం చేశారు కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ రావు కొన్ని కాంపిటేటివ్ బుక్స్ కోసం, సూర్యోదయ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ నాగేశ్వరరావు గారు మిగతా బుక్స్ కోసం గ్రంథాలయానికి ఉపయోగపడే బుక్స డొనేట్ చేస్తామన్నారు.




**జలుమూరు, నవంబర్ 14(వార్త):** సారవకోట గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు, బాలల దినోత్సవ ప్రత్యేకతను వివరించారు ఈ కార్యక్రమంలో. ఎంఈవో మద్దు వెంకటరమణ, రీడర్ ఫోరం అధ్యక్షుడు సారవకోట అప్పారావు గ్రంథాలయ అధికారి డి. సాయమ్మ పలువురు పాల్గొన్నారు.

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** జలుమూరు మండలం బొడ్డపాడు ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంటుముక్కల అయ్యప్ప చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ క్రమంలో పాఠశాల విద్యార్థులకు చిల్డ్రన్స్ డే ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జలుమూరు, నవంబర్ 14(వార్త):** జలుమూరు మండలంలోని ఈదుల వలస ప్రభుత్వ పాఠశాలలో బాల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించామని ఉపాధ్యాయులు చీడి భవాని తెలిపారు. ముందుగా చాచా నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించామన్నారు. అనంతరం చాచా నెహ్రూ జీవిత చరిత్రను పిల్లలకు వివరించారు. ప్రతి ఒక్కరూ నెహ్రూ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానంలోకి ఎదగాలని కోరారు.

**పలాస, నవంబర్ 14(వార్త):** అల్లుకోల ప్రాథమిక పాఠశాల నందు గ్రీన్ ఆర్మీ వారు బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో మొక్కల నాటడం జరిగింది. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ చిన్నతనము నుంచి పిల్లలకు సృజనాత్మకత, విద్య ఉపయోగాలు, ఆచరణాత్మక విషయాలు తెలియజేసి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా చేయవలసిన బాధ్యతగా మనందరిపైన ఉందన్నారు. అనంతరం చాక్లెట్లు పంపిణీ చేసి పిల్లలతో ముచ్చటించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ టీ.మోహన్‌రావు, ఉపాధ్యాయులు ఆర్.భాగ్యలక్ష్మి , జోగారావు సూపర్వైజర్ రిషికేశ్వరరావు ఆరోగ్య సిబ్బంది భారతి, యోగేశ్వరి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## స్వర్ణభారతిలో బాలల దినోత్సవం

**ఇచ్ఛాపురం, నవంబర్ 14 (వార్త):** స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలు ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు విచిత్ర వేష ధారణ ఆకట్టుకుంది. చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో కో ఆర్డినేటర్ నీలిమ రెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాలపై పన్ను వేయండి

*** ఆస్తి పన్ను శత శాతం వసూలు చేయాలి**

*** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, నవంబర్ 14(వార్త):** ఆస్తి పన్ను 100 శాతం వసూలు చేయాల్సిందేనని మున్సిపల్ అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస - కాశీబుగ్గ, ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్లు, ఇతర సిబ్బందితో కలెక్టర్ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మున్సిపాలిటీలు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను వెతకాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాల పన్ను రూ.5.71 కోట్లు వసూలు చేయాల్సి ఉందని, సంబంధిత అధికారుల జీతాలను అటాచ్ చేస్తామని హెచ్చరించారు. చాలా మున్సిపాలిటీలు ప్రకటనల పన్నులను వసూలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి పన్ను వసూలు చేయడంలోనూ ఉదాసీనత పనికిరాదన్నారు. ఇచ్ఛాపురంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి గుడ్ విల్ కింద పన్నులు వసూలు చేయాలని చెప్పారు. పలాస కాశీబుగ్గలో అందుబాటులో ఉన్న మున్సిపాలిటీకి చెందిన నాలుగు ఎకరాల ఖాళీ స్థలంలో పెద్ద షాపింగ్ కాంప్లెక్స్, కళ్యాణ మండపం నిర్మించడానికి ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని విజయాదిత్య పార్కులో ప్రకటనల కోసం పెద్ద పెద్ద హోర్డింగ్లను ఏర్పాటు చేసుకునేందుకు కార్పొరేట్ సంస్థలకు అవకాశం కల్పించాలని వారి నుంచి లీజుతో పాటు ప్రకటనల పన్ను వసూలు చేయాలని చెప్పారు. ఆదాయ మార్గాలు పెంపొందించుకున్నప్పుడే ఆ నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మున్సిపల్ ఆస్తులను రక్షించుకోవాలని, ఖాళీ స్థలాల పన్నులను తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణలో కచ్చితత్వం పాటించి, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలకు పంపించాలన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ నుంచి శ్రీకాకుళం డంపింగ్‌యార్డ్‌కు చెత్తను తరలించాలన్నారు. సమావేశంలో ఆయా మున్సిపల్ కమిషనర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రజలకి అవగాహన అవసరం

ప్రకృతి వ్యవసాయం జిల్లాలో మరింత విస్తరింప చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలో పంటల సాగు, ఉత్పత్తుల విస్తీర్ణం, ఆదాయం మరింత పెరగాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు




మాట్లాడుతూ ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాలకు సర్టిఫికెషన్ అవసరమన్నారు. జిల్లా కలెక్టర్ సంబంధిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఉత్పత్తుల ప్యాకింగ్ పై ఆరా తీశారు. ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి సన్యాసి రావు ప్యాకింగ్ విధానం పై వివరించారు. ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రజలకి అవగాహన అవసరమని, ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపేలా అవగాహన కల్పించాలన్నారు. తద్వారా రైతులకు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. బెజ్జిపురం యూత్ క్లబ్ వ్యవస్థాపకులు ఎం. ప్రసాద రావు, సి.ఎ.వి.ఎస్ స్వచ్ఛంద సంస్థ పగడాల భూదేవి, స్వేప్ స్వచ్ఛంద సంస్థ రమణమూర్తి, ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు, ఇంద్రసేనా రెడ్డి తదితరులు పలు సూచనలు ఇస్తూ, జిల్లా కేంద్రంలో హబ్ ఏర్పాటు చేయాలని తద్వారా మార్కెటింగ్ కి మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. అలాగే ఉత్పత్తుల మొత్తానికి ఒకటే ప్యాకింగ్ చేపట్టి మార్కెటింగ్ చేయాలని అలాగే మిలిట్స్ వాడకానికి సంబందించిన రెస్పి పై అవగాహనా కల్పించిన రోజు వాడకం దారులు ముందుకు వచ్చే అవకాశం ఉండన్నారు. రైతులకు కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకానికి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా అమ్మకానికి స్థలాన్ని కేటాయించాలని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కోరగా జిల్లా కలెక్టర్ ఏర్పాటుకు సంబంధించి మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడి ఏర్పాటు చేయాలని, అలాగే మెప్మా మార్ట్ లో ఆర్గానిక్ ఉత్పత్తులపై ఒక రెక్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. అలాగే ప్రతీ సూపర్ మార్కెట్ లో ఆర్గానిక్ ఉత్పత్తులపై ఒక రెక్ ఏర్పాటు చేయాలని సూపర్ మార్కెట్ ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి ఆర్. వరప్రసాద్, జిల్లా వ్యవసాయ. అధికారి త్రినాధ్ స్వామి, మార్కెటింగ్ సహాయ సంచాలకులు బి రవికుమార్, జిల్లాలో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు, మార్కెటింగ్ చేస్తున్న వ్యాపారులు పాల్గొన్నారు.

## విప్ పదవిపై అభిమానుల ఆనందం

*** విజయవాడ వెళ్లి అభినందన తెలిపిన అశోక్ అభిమానులు**

**కంచిలి, అక్టోబర్ 14 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ అశోక్ బాబు విప్ గా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో ఆయన అభిమానులు పెద్ద ఎత్తున విజయవాడకు చేరుకొని అభినందనలు తెలుపుతున్నారు. హ్యాట్రిక్ విజయం సాధించిన అశోక్ బాబు తొలి క్యాబినెట్లో స్థానం సంపాదిస్తారని అంతా భావించారు. ఆ కోరిక నెరవేరకపోవడంతో కొంత నిరాశపడ్డారు. ఈ పరిస్థితులలో ఇటీవల ఈదుపురం గ్రామానికి ముఖ్యమంత్రి వచ్చిన నేపథ్యంలో అశోక్ బాబుకు ప్రమోషన్ కల్పించాలని సభ ప్రాంగణం నుంచి నియోజకవర్గానికి చెందిన పలువురు విన్నవించారు. శాసనసభ మండలికి చీఫ్ విప్, విప్ లను ఎంపిక చేస్తూ ఈనెల 12వ తేదీ రాత్రి చంద్రబాబు నాయుడు జాబితాను విడుదల చేశారు. అందులో



టిడిపి నుంచి తొలి పేరు అశోక్ బాబుది కావడంతో ఆయన అభిమానులకు ఆనందం హద్దులు దాటింది. తమ సంతోషాన్ని తమ ప్రియతమ నేతతో పంచుకునేందుకు వారంతా అమరావతికి చేరుకుంటున్నారు. కంచిలి మండలానికి చెందిన పైల మన్మధ రెడ్డి, కొర్రాయి కురయ్య, కవిటి మండలంలోని బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన వజ్జ సునీల్ బృందం బుధవారం రాత్రి విజయవాడకు చేరుకొని గురువారం ఉదయం తమ సంతోషాన్ని అశోక్ బాబుతో పంచుకున్నారు.

## విశ్వాసానికి ప్రతీక..!!

*** నమ్మకాన్ని నిరూపించిన లక్కవరం ఏకాదశి ఉత్సవం * వచ్చే ఏడాది 11 అరటి గెలలు కట్టనున్న విప్ * ఏడాదిలోగే మొక్కు తీరడంపై సంతోషం* యాగవిభూతిని నుదుటకు అద్దుకున్న అశోక్ బాబు**

**కంచిలి, అక్టోబర్ 14 (వార్త):** లక్కవరంలో 76వ ఏకాదశి మహోత్సవం సంపూర్ణమైంది. ఆ దేవదేవునికి ఒక ఆశీర్వాదం కోరుకుంటే కచ్చితంగా తీరుతుందనే విశ్వాసం స్థానిక శాసనసభ్యుని విషయంలో నిరూపించబడినది. 2023 నవంబర్‌లో 75వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామానికి అశోక్ బాబు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధి సనపల శ్రీరామమూర్తి వచ్చే ఏడాదికి అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికై.. హ్యాట్రిక్ సాధించడమే కాకుండా పదోన్నతి లభించాలని అందరి సమక్షంలో స్వామివారిని కోరుకున్నారు. ఆ కోరిక నెరవేరితే, 11 అరటి గెలలు కట్టి తన విశ్వాసాన్ని, నమ్మకాన్ని, భక్తిని స్వామివారికి సమర్పించుకుంటానని ఆరోజే ఎమ్మెల్యే ప్రకటించారు. సరిగ్గా ఏడాది పూర్తయిన అదే ఏకాదశి 76వ వార్షికోత్సవం రోజు రాత్రి 8 గంటలకు పదోన్నతి ప్రకటన రావడం.. స్వామి పట్ల ఉన్న నమ్మకానికి ప్రతీక అయ్యింది. శాసనసభ సమావేశాలలో పాల్గొనడం కారణంగా.. ఒక అరటికెలను ఏర్పాటు చేసి మొక్కు తీర్చుకున్నారు. మరుసటి రోజు ద్వాదశి పర్వదినాన వారాహి అమ్మవారి యాగశాల నుంచి, ఏకాదశి యజ్ఞశాల నుంచి విభూది ప్రసాదాన్ని నుదుటికి అద్దుకుని రెండో రోజు విప్‌గా శాసనసభకు వెళ్లారు.



## స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

**సోంపేట, నవంబర్14 (వార్త):** సోంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ప్రజా పోరు ధర్నా కార్యక్రమం సిపిఎం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, త్వరలో నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడానికి సన్నద్ధమవుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించి, ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వమే స్మార్టు మీటర్లు బిగిస్తుండడం గమనార్హమన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా వామపక్షాల పిలుపుపై జరిగే ఆందోళనలలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దున్న యామాయ్య, క్రిష్ణారావు, సింహాచలం, రామారావు, ముఖలింగం, డి యోగేష్ కొర్లయ్య పాల్గొన్నారు.

### స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ ఆపండి

**కొత్తూరు, నవంబర్ 14 (వార్త):** మండల కేంద్రంలో గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా పోరు కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ విద్యుత్ స్మార్ట్ మీటర్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అప్పన్న, రమేష్, దుర్గారావు, క్రిష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



### జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

**కొత్తూరు, నవంబరు 14 (వార్త):** కొత్తూరు మండలంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగింది. పాతపట్నం నియోజకవర్గం సీనియర్ నాయకుల, కొత్తూరు మండల వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు నాయకత్వంలో సిరుసువాడ గ్రామ సర్పంచ్ వలురౌతు పోలినాయుడు అధ్వర్యంలో టిడిపి సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకి టిడిపి సభ్యత్వం ఒక భరోసా అని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కొయిలాపు సంజీవరావు, పడాల వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఉల్లాస్‌పై శిక్షణ

**వంగర, నవంబర్ 14 (వార్త):** కేంద్ర ప్రభుత్వం మండల మహిళా స్వయంశక్తి సంఘాల వివోఏలు, స్వయం శక్తి సంఘాలకు ఎంపికైన అభ్యసన వాలంటీర్లతో ఐకెపి కార్యాలయంలో ఏపిఎం టి.మంగమ్మ ఆధ్వర్యంలో గురువారం ఉల్లాస్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్ ముఖర్జీ, ఎంఇఓ పి.ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో త్రినాధరావు, పంచాయతీ విస్తరణాధికారి కెల్ల రామారావు పాల్గొన్నారు.

### గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

**మెళియాపుట్టి, నవంబర్ 14 (వార్త):** గ్రంథాలయాలను విజ్ఞాన భాండాగారాలని మండల విద్యాశాఖధికారులు దేవేంద్రరావు, పద్మనాభం అన్నారు. మండల కేంద్రంలో గల శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అనురాధ నేతృత్వంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలలో గురువారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. ప్రతీ విద్యార్థి తరచూ గ్రంథాలయాలలో పుస్తకపఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

### మత్స్యకారుల గుర్తింపు కార్డులను వినియోగించుకోండి

**వజ్రపుకొత్తూరు, నవంబర్ 14 (వార్త):** ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి యోజన (ఎన్ఎఫ్‌డిపి) కింద మత్స్యకారులకు అందిస్తున్న గుర్తింపు కార్డులు సద్వినియోగం చేసుకోవాలని పలాస మత్స్య శాఖ ఫీల్డ్ ఆఫీసర్ కొండ నాగరాజు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మత్స్యకారుడు కూడా ఈ గుర్తింపు కార్డులు కలిగివుండాలన్నారు. ఈ గుర్తింపు కార్డులకు ఇన్సూరెన్స్ కూడా ఉందన్నారు. జిల్లాలో ఉన్న 104మత్స్యకార గ్రామాలతో పాటు వజ్రపుకొత్తూరు మండలంలో దేవునల్తాడ, కొత్తపేట, కంబాలరాయుడుపేట, హుకుంపేట, మంచినీళ్లు పేట, నువ్వలరేవు, డోకులపాడు, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి, గునుపల్లి, తోటూరు మత్స్యకార గ్రామాల్లో ఉన్న మత్స్యకారులు ఈ గుర్తింపు కార్డులను వినియోగించుకోవాలన్నారు.

### అపార్‌ను వేగవంతం చేయండి:ఆర్డీవో

**మెళియాపుట్టి నవంబర్ 14 (వార్త):** మెళియాపుట్టి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న ఆపార్ కేంద్రాన్ని ఆర్డీవో సందర్శించారు. అంతకుముందు మండల కేంద్రంలోని గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లగా ఆ సమయంలో విద్యార్థులు తరగతి గదిలో పాఠ్యాంశాలను కింద కూర్చుని వింటుండడంతో ఫర్నిచర్ కోసం ప్రధానోపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకం ద్వారా విద్యార్థుల కోసం తయారు చేస్తున్న పదార్థాలను పరిశీలించారు. పాఠశాలలో ఫర్నిచర్ కొరత, గేటు, గ్రౌండు తదితర సమస్యలు ఉన్నాయని ఎస్ఎంసి చైర్మన్ చిన్నబాబు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

### ఏఎస్ఐ కుమారునికి కారుణ్య నియామక పత్రం

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 14 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో కవిటి పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ గత ఏడాదిలో అనారోగ్యంతో డి.భాస్కరరావు మృతి చెందారు. అతని కుమారుడు సాయి రాముకి కారుణ్య నియామకం ప్రకారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పిస్తూ నియామకపత్రాన్ని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, పోలీసు శాఖ మీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఏఓ సి హెచ్ గోపినాథ్, ఎస్బి సీసీ బి.వి.శివప్రసాద్ ఉన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546